సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 13 । ఏప్రిల్ । 2023



రాజస్థాన్ 'రాజు'సం

ఇండియన్ డెఫ్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఐడీసీఏ 4వ టీ–20 డెఫ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌లో కడప క్రీడాకారుడు ఎంపికయ్యాడు. - 8లో



28 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

వీరబల్లి ఫారెస్ట్ బీట్ పరిధిలో 28 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.74	రూ.92
రెండోరకం	రూ.50	రూ.72

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 219 మెట్రిక్ టన్నులు



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు (సా॥)	సహర్ శుక్ర (ఉ॥)
రాజంపేట	6.33	4.43
రాయచోటి	6.33	4.40
మదనపల్లి	6.34	4.42
పీలేరు	6.31	4.37

న్యూస్‌రీల్

ఎంఐజీ లే అవుట్‌లో ప్లాట్ల వేలం

రాయచోటిటౌన్ : అన్నమయ్య జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అనుడా) రాయచోటి సమీపంలోని దిగువ అబ్బవరం రెవెన్యూ పరిధిలో తొమ్మిది సర్వే నంబర్లలోని 30 ఎకరాలలో చేపట్టిన జగనన్న స్మార్ట్ షిప్‌లో 3 సెంట్ల ప్లాట్లు విక్రయించేందుకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు అనుడా చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాట ఈనెల 18వతేదీ మంగళవారం సాయంత్రం 3 గంటలకు రాయచోటి మున్సిపల్ కార్యాలయంలో జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు ఈ వేలం పాటలో పాల్గొనవచ్చని వివరించారు.

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ఆకస్మిక తనిఖీ

రాయచోటిటౌన్: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం రాయచోటి మండలం మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల పంపిణీని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యండపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ దివ్యవాణి, యంపీహెచ్‌ఈఓ యం. వేణుగోపాల్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

భూ సార పరీక్షలపై శిక్షణ కార్యక్రమం

సంబేపల్లె : జిల్లా స్థాయిలో నేల ఆరోగ్యం భూసార పరీక్షలపై శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నారాయణరెడ్డిపల్లె రైతు భరోసా కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సోమశేఖర్ మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకోవడం వలన తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చన్నారు. భూమిలో ఉండే పోషకాల మోతాదును తెలుసుకోవచ్చని తెలిపారు. భూమిలో లభ్యమయ్యే నత్రజని, భాస్వరం, పొటాషియంతో పాటు ఉదజని సూచిక తెలుసుకోవచ్చన్నారు. అనంతరం సమీప పొలాల్లో భూసార పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీడీఏ అన్నపూర్ణమ్మ, డీఆర్‌సీ ఏడీఏ సావిత్రి, జిల్లాలోని ఏడు వ్యవసాయ డివిజన్ల సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

- ప్రతి మహిళ ఆర్థికంగా ఎదిగేలా సహకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- వైఎస్ఆర్ ఈబీసీ నేస్తాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : మహిళా సాధికారతే లక్ష్యంగా వైఎస్ఆర్ ఈబీసీ నేస్తం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటును అందిస్తోందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. బుధవారం ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి వైఎస్ఆర్ ఈబీసీ నేస్తం పథకం కింద 45–60 సంవత్సరాల మధ్య వయసు ఉన్న అర్హులైన అగ్రవర్ణాలకు చెందిన అక్క చెల్లెమ్మలకు రెండో విడత ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి నేరుగావారి ఖాతాల్లో జమ చేసే బృహత్తర కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. వైఎస్ఆర్ ఈబీసీ నేస్తం పథకం ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి జమ చేసే వర్చువల్ కార్యక్రమాన్ని రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, డీఆర్‌ఓ సత్యనారాయణ, రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ వి.వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ శాఖ అధికారి సందప్ప, మహిళలు హాజరై వీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమలతో పాటు ఇతర ఓసీ సామాజిక వర్గాలకు చెందిన అర్హులైన పేద మహిళలకు వైఎస్ఆర్ ఈబీసీ నేస్తం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వం ద్వారా ఆర్థికసాయం అందుకున్న మహిళలు సొంత వ్యాపారాలు లేదా జీవనోపాధి మార్గాలను ఎంచుకొని వారి కాళ్ల మీద వారు నిలబడేట్టుగా ఎదగాలన్నారు. మహిళల భద్రత కోసం దిశ యాప్, దిశ పోలీస్‌స్టేషన్లు, గ్రామ వార్డు సచివాలయాలలో మహిళా పోలీసులను నియమించడంతో పాటు అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, డీఆర్‌ఓ, మార్కెట్ కమిటీ చైర్మన్, బీసీ సంక్షేమ శాఖ అధికారి తదితరులు వైఎస్ఆర్ ఈబీసీ నేస్తం రెండో విడత లబ్ధి రూ.37.06 కోట్ల మెగా చెక్కును అర్హులైన మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మార్కెట్ కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు మెగా చెక్కును అందజేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఇతర అధికారులు తదితరులు

అన్నగా ఆదుకుంటున్నాడు



ఎన్నో ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబం మాది. జీవనం గడపడం దినదిన గండంగా ఉండేది. ఇలాంటి పరిస్థితులలో జగనన్న వైఎస్ఆర్ ఈబీసీ నేస్తం ద్వారా అందిన ఆర్థిక సాయంతో కిరాణా దుకాణం పెట్టుకున్నాను. దుకాణం బాగా జరుగుతోంది. ఒక మహిళగా నేను నా కాళ్ల మీద నిలబడటమే కాకుండా నా భర్తకు కూడా చేదోడు వాదోడుగా నిలుస్తున్నాను. నిరుపేద మహిళలకు ఒక అన్నగా.. ఆర్థిక సహాయం అందిస్తూ ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పది కాలాల పాటు చల్లగా ఉండాలి.

– పి.అన్నపూర్ణ, ఎస్ఎస్ కాలనీ, రాయచోటి

మహిళా పక్షపాతి



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి. ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అమ్మ ఒడి, చేయూత, ఆసరా, విద్యాదీవెన, వసతిదీవెన, ఈబీసీ నేస్తం లాంటి అనేక మహిళా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధితో కుటుంబ ఆసరా నిమిత్తం టిఫిన్ సెంటర్ పెట్టుకుని నడుపుకుంటున్నాను. మాలాంటి పేద మహిళలను ఆదుకుంటున్న ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఎప్పుడూ రుణపడి ఉంటాం.

– డి.పుష్పలత, బ్రాహ్మణవీధి, రాయచోటి

మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతున్న మహనీయుడు



మహిళలు సొంతంగా వ్యాపారాలు చేసుకుని మా కాళ్ల మీద మేము నిలబడేట్టుగా తోడ్పాటు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి శతకోటి వందనాలు. ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి మహిళల జీవితాలలో వెలుగులు నింపుతున్న మహనీయుడు అని చెప్పవచ్చు.

–వి.రెడ్డమ్మ, చీరల వ్యాపారం, అలీమాబాద్‌వీధి, రాయచోటి

అన్ని లేఅవుట్లలో నీటి వసతి కల్పించాలి

రాయచోటి: వైఎస్సార్ జగనన్న కాలనీలలోని అన్ని లేఅవుట్లలో నీటి సరఫరా పనులు వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్, పబ్లిక్ హెల్త్ అధికారులను కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లో వైఎస్సార్ జగనన్న కాలనీలలోని అన్ని లేఅవుట్లలో నీటి సరఫరా, విద్యుత్ కనెక్షన్ పెండింగ్ తదితర పనుల పురోగతిపై హౌసింగ్, ఆర్‌డబ్ల్యుఎస్, పబ్లిక్ హెల్త్, ఏపీఎస్పీడీసీఎల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పీలేరులో 14 లేఅవుట్‌లు, గుర్రంకొండ 2, కేవీపల్లి 6, ఇతర మండలాల్లోని లేఅవుట్‌లో నీటి సదుపాయం కల్పించాల్సి ఉందన్నారు. ఆ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. వచ్చే బుధవారం కల్లా రాజంపేటలో నీటి సరఫరా పనులు పెండింగ్‌లో ఉండకూడదన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ శివయ్య, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ప్రసన్న కుమార్, పబ్లిక్ హెల్త్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పుష్పగిరి బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

వల్లూరు: ఈ నెల 18 వ తేదీ నుండి 27 వ తేదీ వరకు జరగనున్న పుష్పగిరి శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి, శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి , కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డిలు బుధవారం ఆవిష్కరించారు. ఆలయ అర్చకులు సుమంత్ దీక్షితులు, ఆలయ ప్రతినిధులు వెంకట సుబ్బారెడ్డి, మురళీ మోహన్‌రెడ్డి, చెన్న కేశవ రెడ్డి, ఇందిరెడ్డి శంకర్ రెడ్డి తదితరులు వేంపల్లె మండలం వీరన్నగట్టుపల్లె గ్రామంలో జరుగుతున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అవినాష్‌రెడ్డిని కలిసి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. అనంతరం ఆయన వారితో కలిసి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిచారు. కడపలోని కమలాపురం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డిని కలిసి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. అనంతరం ఆయన బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యం

అన్నమయ్య జిల్లా నూతన ఎస్పీ గంగాధర్‌రావు

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన గంగాధర్‌రావు స్పష్టం చేశారు. బుధవారం రాత్రి అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా విశిష్టతను, ఈ ప్రాంత పరిస్థితులను పూర్తి స్థాయిలో అవగతం చేసుకున్న తర్వాత అందరి సహకారంతో ముందుకుపోతామన్నారు. సమష్టిగా, సమన్వయంతో ప్రజల సంక్షేమం, శాంతిభద్రతల కోసం అవసరమైన నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

పూర్ణకుంభంతో స్వాగతం

నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టడానికి పోలీస్ ప్రధాన కార్యాలయానికి చేరుకున్న ఎస్పీ గంగాధర రావుకు అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్, ఇతర అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

వీరభద్రుని సేవలో..

అన్నమయ్య జిల్లా నూతన ఎస్పీ గంగాధర్‌రావు రాయచోటి వీరభద్రుని సేవలో తరించారు. ఎస్పీగా బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా రాయచోటి వీరభద్రస్వామి ఆలయాన్ని సతీసమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్‌పర్సన్ విజయమ్మ, ఈఓ రమణారెడ్డి, ప్రధాన అర్చకులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు. వీరి వెంట డీఎస్పీ శ్రీధర్, అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అన్నమయ్య జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపడుతున్న గంగాధరరావు

మీ అభిమానం మరువలేను



మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రాయచోటి : అన్నమయ్య జిల్లా ఎస్పీగా పనిచేసిన అనుభవం, జిల్లా ప్రజలు చూపిన అభిమానం, విధి నిర్వహణలో జిల్లా పోలీసు యంత్రాంగం అందించిన సహకారాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటానని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. బదిలీపై వెళ్తున్న ఎస్పీ అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ పలకరింపు సమావేశంలో మాట్లాడారు. జిల్లా ఎస్పీగా ఏడాది పాటు విధి నిర్వహణలో తనకు సహకరించిన ప్రతి పోలీసు అధికారికి, సిబ్బందికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. మీ అందరితో కలిసి పనిచేయడం నాకు సంతోషాన్నిచ్చిందన్నారు. జిల్లా ప్రజలు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు, ఇతర శాఖల అధికారులు సిబ్బంది ఎంతో సహకరించారన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, బందోబస్తు సమయంలో అందరూ బాగా విధులు నిర్వర్తించారని కొనియాడారు. అడిషనల్ ఎస్పీ విఠల్‌రావు పాల్గొన్నారు.

జేసీని ఆదర్శంగా తీసుకోవాలి

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన తమీమ్ అన్సారియాను ఆదర్శంగా తీసుకుని విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా బదిలీ నేపథ్యంలో బుధవారం కలెక్టర్ చాంబర్‌లో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ సమస్య ఏదైనా జేసీ సానుకూలంగా స్పందిస్తూ ముందుకు సాగేవారని తెలిపారు. కొత్త జిల్లాలో అనేక రకాల సమస్యలు ఉత్పన్నమైనప్పటికీ ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ జిల్లా అభివృద్ధికి అన్ని విధాల తోడ్పాటు అందించారని కొనియాడారు. డీఆర్వో సత్యనారాయణ, డీఎస్ఓ రఘునాథ్, సర్వే అండ్ ల్యాండ్స్ జిల్లా అధికారి జయరాజు, ఏఓ బాలకృష్ణ తదితరులు మాట్లాడారు. అనంతరం జేసీ తమీమ్ అన్సారియాను జిల్లా కలెక్టర్ గిరీషా శాలువాతో ఘనంగా సత్కరించారు.

జిల్లాను మరిచిపోలేను : జేసీ తమీమ్ అన్సారియా

అన్నమయ్య జిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా 2022 ఏప్రిల్ 4న బాధ్యతలు చేపట్టే సమయంలో ఒక రకంగా ఆందోళన చెందానని, నూతన జిల్లాలో ఏం చేయగలమన్న భయం తనలో ఉండేదని జేసీ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. అయితే జేసీగా బాధ్యతలు తీసుకున్న తర్వాత కలెక్టర్ గిరీషా పీఎస్‌తో మాట్లాడిన తర్వాత ధైర్యం వచ్చిందన్నారు. ఎలాంటి సదుపాయాలు లేని జిల్లాలో తమ పనితీరును ప్రదర్శించాలన్న సంకల్పంతో ముందుకు వెళ్లేలా కలెక్టర్ ప్రోత్సహించారన్నారు. ఈ ప్రాంతాన్ని, ఇక్కడి ప్రజలను ఎన్నటికీ మరిచిపోలేనని, జేసీగా గుర్తింపునిచ్చిన జిల్లాను కలకాలం గుర్తు పెట్టుకుంటానని ఆమె భావోద్వేగంతో పేర్కొన్నారు. విధి నిర్వహణలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



జేసీ తమీమ్ అన్సారియాను సత్కరిస్తున్న కలెక్టర్ పీఎస్ గిరీషా

కల సాకారమైన వేళ...

- 98 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల్లో వెల్లివిరిసిన ఆనందం
- 172 మందికి 160 మంది హాజరు
- నియామక పత్రాలు అందజేత

కడప ఎడ్యుకేషన్: 1998 డీఎస్సీ అభ్యర్థుల ఏళ్ల నాటి కల నెరవేరింది. వారి కళ్లలో ఆనందం మెరిసింది. మా జీవితాల్లో వెలుగు నింపి మాకు, మా పిల్లల భవిష్యత్తుకు సీఎం బాటలు వేశారంటూ పొంగిపోయారు. జగనన్నకు జేజేలంటూ నినాదాలతో బుధవారం కడప డీఈఓ కార్యాలయ ఆవరణమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఎన్నో ఏళ్ల కల నెరవేరిందని ఒకరికొకరు సంతోషాన్ని పంచుకున్నారు.

పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు...

వైఎస్ జగన్ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు చేపట్టిన పాదయాత్రలో 1998 డీఎస్సీ అభ్యర్థులు ఆయనను కలిసి తమ కష్టాలను విన్నవించారు. ఆయన ముఖ్యమంత్రి కాగానే న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు హామీకి కట్టుబడి వారి జీవితాల్లో వెలుగు నింపారు. ఇచ్చిన హామీ మేరకు మినిమం టైమ్ స్కేల్ కింద నెలకు రూ. 32, 670 వేతనాన్ని ప్రకటించి వారికి నియామక ఉత్తర్వులను అందచేశారు.

160 మందికి...

వైఎస్ఆర్ జిల్లాలో 580 మంది అభ్యర్థులకుగాను 172 మంది 1998 డీఎస్సీ అభ్యర్థులకు బుధవారం కడపలోని డీఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో 172 మందికిగాను 160 మంది హాజరయ్యారు. వీరి సర్టిఫికెట్లను డీఈఓ రాఘవరెడ్డి, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డితోపాటు ఏడీలు పరిశీలించారు. అనంతరం అందరికీ నియామక పత్రాలను అందజేశారు.

- డీఈఓ రాఘవరెడ్డి మాట్లాడుతూ వీరందరినీ 20 నుంచి 30 మంది విద్యార్థులున్న ఏకోపాధ్యాయ పాఠశాలల్లో అదనపు ఉపాధ్యాయుడిగా పోస్టింగ్ ఇవ్వనున్నామన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

98 డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు బుధవారం కడప డీఈఓ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి కడప నగర మేయర్ సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత విద్యకు పెద్దపీట వేశారన్నారు. దీంతోపాటు ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. జగన్ పాదయాత్రలో 98 డీఎస్సీ అభ్యర్థులకు ఇచ్చిన హామీ మేరకు వారందరికీ ఉద్యోగాలను కల్పించి వారి జీవితాల్లో వెలుగు నింపారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర బాధ్యులు సజ్జల రమణారెడ్డి, శివశంకర్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, వీఎన్‌పల్లి వైఎస్సార్‌టీఎఫ్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాలను అందచేసిన మేయర్, డిప్యూటీ మేయర్లు...

98 డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు డీఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో డీఈఓ రాఘవరెడ్డితో కలిసి నగర మేయర్ సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డి, ఎల్ఆర్‌పల్లె ఎంపీపీ సుదర్శన్‌రెడ్డిలు నియామక పత్రాలను అందచేశారు.




ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందచేస్తున్న నగర మేయర్ సురేష్‌బాబు




సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న మేయర్ సురేష్‌బాబు, 98 డీఎస్సీ అభ్యర్థులు




నా పేరు శివకుమార్. వయసు 55 ఏళ్లు. భార్య, కుమార్తె ఉన్నారు. నాది కడప. 98 డీఎస్సీలో 0.5 మార్కుల తేడాతో ఉద్యోగం రాలేదు. చాలా నిరాశకు గురయ్యాను. చేసేదేమీ లేక ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా జీవితం కొనసాగిస్తున్నాను. ఆశలన్నీ ఉడిగిపోయిన దశలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు ఊపిరి పోశారు. మా పాప టెన్త్ పరీక్షలు రాస్తోంది. జీవితంలో అత్యంత కీలకమైన దశలో మాకు ఉద్యోగాలివ్వడం ఎన్నటికీ మరిచిపోలేం. మాకు, మా పాప భవిష్యత్తుకు భరోసానిచ్చిన ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటాం.




నా పేరు మోరగుడి సుధాకర్. వయసు 51 సంవత్సరాలు. ఎంఏ(మ్యాథ్స్), బీఈడీ చదివాను. 98 డీఎస్సీలో క్వాలిఫై అయినా ఉద్యోగం రాలేదు. మాది దిగువ మధ్యతరగతి కుటుంబం. ఆస్తిపాస్తులేమీ లేవు. పాతికేళ్ల నుంచి ప్రైవేటు స్కూళ్లలో టీచర్‌గా పనిచేస్తున్నాను. తల్లిదండ్రులు, చెల్లెళ్ల బాధ్యతను నెరవేర్చాను. నా భార్య గృహిణి. కుమార్తె పదో తరగతి పరీక్షలు రాస్తోంది. నాకొచ్చే ఆదాయంతో కనాకష్టంగా కుటుంబ జీవనం సాగేది. ఈ జీవితాకింతే అనుకున్న దశలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం ఎనలేని సంతోషాన్నిచ్చింది. ప్రభుత్వ ఉపాధ్యాయుడిని కావాలనే నా కల నెరవేరుస్తున్న సీఎం రుణం ఏం చేసినా తీర్చుకోలేను.




నా పేరు మధుసూదన్. నాది కడప టౌన్. నేను 98 డీఎస్సీ క్వాలిఫై అయినా అప్పట్లో ఏదో కారణాలతో ఉద్యోగం ఇవ్వలేదు. దీంతోపాటు నా వ్యక్తిగత కారణంతో ఉద్యోగం లేకపోవడంతో పెళ్లి చేసుకోలేదు. తరువాత చేసేదేమి లేక జీవనోపాధి కోసం ఓ ప్రైవేటు టీచర్ ట్రెయినింగ్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేశాను. తరువాత అక్కడ పిల్లల సంఖ్య తగ్గడంతో ఉద్యోగం మాని మళ్లీ ఓ ప్రైవేటు పాఠశాలలో చేరి ఉద్యోగం చేశాను. ఇప్పుడు డీఎస్సీలో ఉద్యోగం వచ్చింది. నాకు 8 ఏళ్ల సర్వీస్ ఉంది.



నాపేరు చంద్రమోహన్‌రెడ్డి. నేను 98 డీఎస్సీలో క్వాలిఫై అయ్యాను. అప్పట్లో ఉద్యోగం రాలేదు. వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నా. నాకు ఇద్దరు పిల్లలు. వారిని చదివించుకున్నాను. వారు నా కష్టాన్ని గుర్తించి ఇంజనీరింగ్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాకు తీపి కబురు అందించారు. కౌన్సిలింగ్ నిర్వహించి నియామక పత్రం అందించారు. చాలా సంతోషంగా ఉంది. నాకు నాలుగేళ్ల సర్వీస్ ఉంది. అయినా సరే ప్రభుత్వ టీచర్ అనిపించుకుంటే చాలనే తృప్తితో ఉద్యోగం చేస్తా.



నాపేరు చాంద్‌బాష. మాది పొద్దుటూరు. నేను ఒక ప్రైవేటు ట్రాక్టర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నా. ప్రైవేటు ఉద్యోగమంటే ఒత్తిళ్లతో కూడుకున్నదైనప్పటికీ జీవనం కోసం కష్టపడాల్సి వచ్చేది. నాకు ఇద్దరు పిల్లలు. వారు బాగా చదివారు. నాకు ఇప్పుడు 98 డీఎస్సీలో ప్రభుత్వం ఉద్యోగం కల్పించింది. నాకు ఇంకా 10 ఏళ్ల సర్వీస్ ఉంది. నా ప్రభుత్వ ఉద్యోగ కల నెలవేరింది. ఈ పదేళ్లు పేద పిల్లలకు చదువు చెప్పి వారి జీవితాల్లో వెలుగు నింపుతా.



నా పేరు సుబ్బరామరాజు. నాది రాయచోటి. నేను కడపలోని ఓ కార్పోరేట్ స్కూల్లో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాను. ఉద్యోగరీత్యా నేను కడపలో స్థిరపడ్డాను. నాకు ఇద్దరు పిల్లలు. వారిని చదివించాను. ఇందులో కుమార్తెకు వివాహం చేశాను. కుమారుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. నాకు ఇప్పుడు 58 సంవత్సరాలు. నాకు నాలుగేళ్ల సర్వీస్ ఉంది. ప్రభుత్వ ఉద్యోగ కల నెలవేరింది.

క్లుప్తంగా

సపోటా తోట దగ్ధం

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని గుడ్లవారిపల్లె సమీపంలోని రైతు సుబ్బారెడ్డి, రుక్మాంద రెడ్డిలకు చెందిన సపోటా తోట బుధవారం సాయంకాలం అగ్నికి ఆహుతయ్యాయి. దాదాపు 150 సపోటా చెట్లు, తోటలోని స్ప్రింకర్లు పైపులు, డ్రిప్పు వైర్లు, పైపులు కాలిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆకతాయిలు నిప్పు పెట్టడంతోనే తోటకు మంటలు చుట్టుముట్టాయని తెలిపారు. లక్కిరెడ్డిపల్లి అగ్ని మాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. దాదాపు రూ.2 లక్షల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యల కారణంగా మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి పట్టణంలో జరిగింది. పట్టణంలోని బుగ్గకాలువకు చెందిన మధు భార్య ఎం.అరుణ (24) పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకుంటోంది.

ఆలయాల్లో హుండీల చోరీ

రామసముద్రం : మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయతీలోని తిరుమలరెడ్డిపల్లెలో వెలసిన మారెమ్మ ఆలయం, మట్లవారిపల్లెలోని శివాలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆలయ తలుపులు పగులగొట్టి హుండీలను ఎత్తుకెళ్లారు. మారెమ్మ ఆలయంలో ఉన్న అమ్మవారికి అలంకరించిన బంగారు తాళిబొట్టు, ముక్కుపుడక, హుండిలోని డబ్బులు చోరీ చేశారు. ఈ ఆలయం ప్రక్కనే ఉన్న చికెన్ దుకాణం తలుపులు పగులగొట్టి ఏడు కోళ్లను ఎత్తుకెళ్లారు.

వ్యక్తి ఆత్మహత్యకు కారకుడైన నిందితుడి అరెస్టు

ములకలచెరువు : భార్య అక్రమ సంబంధం పెట్టుకుందని మనస్తాపానికి గురై భర్త ఆత్మహత్య చేసుకోవడానికి కారకుడైన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ డీవై స్వామి బుధవారం తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు... స్థానిక మండల కేంద్రం ఇందిరాకాలనీకి చెందిన ఎస్.అక్బర్‌బాషా(36) మార్చి నెల 26వ తేదీ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి బాషా ఫిర్యాదుతో వై. వినోద్‌కుమార్(32)పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు స్థానిక కరెంట్ స్టేషన్ వద్ద వినోద్‌కుమార్ ఉండగా అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేడినీరు పడి మహిళకు గాయాలు

మదనపల్లె : వేడినీళ్లు పడి మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన మదనపల్లె పట్టణంలో జరిగింది. బసినికొండ దర్గాకు చెందిన ఫైజుల్లా భార్య ఎస్.మెహతాజ్ (26) బుధవారం ఇంటిలో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు వేడినీళ్లు శరీరంపై పడ్డాయి. తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

రాజస్థాన్ రాజుసం

పుట్టుకతో మూగ, చెవుడు.. చుట్టూ ఉన్నవారి హేళనలు.. జాలిచూపులు.. వీటన్నింటినీ దాటుకుని తనకంటూ ప్రత్యేకతను చాటిచెబుతూ ఓ వైపు క్రికెట్‌లో మరోవైపు వాలీబాల్ పోటీల్లో కడప నగరానికి చెందిన బిల్లా రాజు రాణిస్తున్నాడు. ఇండియన్ డెఫ్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఐడీసీఏ 4వ టీ–20 డెఫ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌లో పాల్గొనే రాజస్థాన్ రాయల్స్ జట్టుకు ఎంపికయ్యాడు. దీంతో ఈయన ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు కోల్‌కతాలో నిర్వహించే టీ–20 టోర్నమెంట్‌లో పాల్గొననున్న నేపథ్యంలో రాజు క్రీడాప్రస్థానంపై ప్రత్యేక కథనం.

- డెఫ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్‌కు కడప కుర్రాడు
- రాజస్థాన్ రాయల్స్ జట్టుకు బిల్లా రాజు ఎంపిక
- ఈనెల 23 నుంచి 27 వరకు కోల్‌కతాలో టోర్నమెంట్


బ్యాటింగ్ చేస్తున్న రాజు



మెడల్ అందుకుంటున్న రాజు

కడప స్పోర్ట్స్: కడప నగరం మరియాపురంనకు చెందిన కుమారి (గృహిణి), సుబ్బరాయుడు (మున్సిపల్ వాటర్ విభాగంలో పంప్ ఆపరేటర్) దంపతుల కుమారుడైన బిల్లా రాజుకు పుట్టుకతోనే మూగ, చెవుడు. దీంతో వారి తల్లిదండ్రులకు కొద్ది రోజుల పాటు ఇబ్బందులు తప్పలేదు. చుట్టూ ఉన్నవారి జాలిచూపులు, హేళనలు బాధించినా రాజును ఉన్నతంగా చూడాలన్న తల్లిదండ్రులు.. కడప నగరంలోని హెలెన్‌కెల్లెర్స్ బధిరుల పాఠశాలలో చేర్పించారు. రాజు సోదరుడు రవి క్రికెట్ ఆడుతున్న సమయంలో అతనితో పాటు వెళ్తూ మెల్లగా క్రికెట్ సాధన చేయడం ప్రారంభించాడు రాజు. తమ్మునిలోని క్రికెట్ నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహించాడు. దీంతో 9వ తరగతికి వచ్చేనాటికి క్రికెట్, వాలీబాల్ క్రీడలపై అభిమానం పెంచుకున్నాడు. దీంతో కడప నగరంలోని డీఎస్‌ఏ క్రికెట్ స్టేడియంలో క్రికెట్‌కు, వాలీబాల్ క్రీడల్లో శిక్షణకు వచ్చేవాడు. వాలీబాల్ పోటీల్లో పలుమార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు.

- క్రికెట్ కోచ్ ప్రసాద్, ఇలియాస్‌లు ప్రోత్సహించడంతో ప్రొఫెషనల్ క్రికెటర్‌గా మారాలని భావించాడు. పదోతరగతి అనంతరం ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని స్వీకార్ ఉపకార్ కళాశాలలో చేరాడు. అక్కడే ఆయన క్రికెట్ జీవితం మలుపుతిరిగింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ అకాడమీలో శిక్షణ పొందుతూ డెఫ్ క్రికెట్‌లో పాల్గొనడం ప్రారంభించాడు. అనతి కాలంలోనే హైదరాబాద్ డెఫ్ జట్టుకు కెప్టెన్‌గా రాణించాడు. ఎడమచేతి వాటం గల రాజు బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణిస్తూ ఆల్‌రౌండర్‌గా హైదరాబాద్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. గత సీజన్‌లో హైదరాబాద్ డెఫ్ జట్టుకు ప్రాతినిథ్యం వహించిన ఈయన తాజాగా రాజస్థాన్ రాయల్స్ జట్టుకు ఎంపికయ్యాడు.
- ఇండియన్ డెఫ్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు కోల్‌కతాలో నిర్వహించనున్న ఐడీసీఏ 4వ డెఫ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ పోటీల్లో పాల్గొనే రాజస్థాన్ రాయల్స్ జట్టుకు ఈయన ప్రాతినిథ్యం వహించనున్నాడు. ఇప్పటి వరకు సౌత్‌జోన్ టీ–20, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తూ వస్తున్న ఈయన అంతర్జాతీయ పోటీల్లో భారత డెఫ్ జట్టుకు ప్రాతినిథ్యం వహించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు.
- రాజు ఓవైపు క్రికెట్‌లో రాణిస్తూ కుటుంబ పోషణ కోసం కడప నగరంలోని ఓ ప్రైవేట్ ఫొటో స్టూడియోలో గ్రాఫిక్ డిజైనర్‌గా పనిచేస్తూ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. జిల్లాకు చెందిన రాజు రాజస్థాన్ రాయల్స్ జట్టుకు ఎంపికవడం పట్ల జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

పులివెందుల సబ్ రిజిస్ట్రార్, ఆరుగురిపై చీటింగ్‌కేసు

మదనపల్లె : ఫోర్జరీ సంతకాలతో నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించిన పులివెందుల సబ్‌రిజిస్ట్రార్‌తో సహా ఆరుగురు నిందితులపై న్యాయస్థానం ఆదేశాల మేరకు చీటింగ్ కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. వివరాలు... మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన కట్టా సులోచన, మార్వారి అబ్బయ్యగారివీధికి చెందిన వెంకటేశ్వర్లనాయుడుల మధ్య కొంతకాలంగా నీరుగట్టువారిపల్లె మార్కెట్ పక్కన ఉన్న సర్వే నెంబరు 36/1లో స్థలం విషయమై భూవివాదం నడుస్తోంది. ఈ క్రమంలో సదరుస్థలాన్ని కట్టా సులోచన తన అనుచరులైన అనపగుట్టకు చెందిన గోవిందు, సత్యసాయి జిల్లా కదిరికి చెందిన గుడిగళ్ల మోహన్, మదనపల్లెకు చెందిన భాస్కర్, జి.మోహన్‌లతో కలిసి పులివెందుల సబ్‌రిజిస్ట్రార్ సహకారంతో ఫోర్జరీ సంతకాలతో నకిలీ డాక్యుమెంట్ సృష్టించారు. భూమికి సంబంధించి జనరల్ పవర్ ఆఫ్ పట్టా (జీపీఏ)ను తారుమారు చేసి రిజిస్ట్రేషన్ నంబరు 719/23తో 03/02/2023 తేదీన రిజిస్టర్ చేసి విక్రయించారని బాధితుడు వెంకటేశ్వర్లనాయుడు ఆరోపిస్తూ మదనపల్లె కోర్టులో తనకు జరిగిన మోసంపై ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం బాధ్యులపై కేసు నమోదు చేయాల్సిందిగా టూటౌన్ పోలీసులకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు పులివెందుల ఎస్‌ఆర్‌ఓతోపాటు నిందితులైన సులోచన, ఆమె అనుచరులు గోవిందు, గుడిగళ్ల మోహన్, భాస్కర్, జి.మోహన్‌లపై 109, 120బి, 167, 416, 420, 465, 468, రెడ్‌విత్156(3) సెక్షన్లతో చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి


వృద్ధురాలి మృతదేహం

మదనపల్లె : గుర్తుతెలియని వృద్ధురాలు అనుమానాస్పదంగా చెరువులోపడి మృతి చెందిన సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో వెలుగు చూసింది. తట్టివారిపల్లె గ్రామ సమీపంలోని తట్టివారిపల్లెచెరువులో బుధవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం నీటిపై తేలియాడుతుండటంతో స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని వెలికితీయించారు. మృతదేహాన్ని చూసిన స్థానికులు ఎవరూ ఆమెను గుర్తించలేకపోవడంతో మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతురాలి వయస్సు (65–70 ఏళ్ల) మధ్య ఉండవచ్చునని పోలీసులు తెలిపారు. ఆమె ఎడమచేతిపై మార్కెండేయ అనే పేరుతో పచ్చబొట్టు ఉండగా ఆమె రోస్ కలర్ చీర, పసుపురంగు జాకెట్టు ధరించి ఉంది. మృతురాలు ప్రమాదవశాత్తు చెరువులోపడి పోయిందా? లేదా ఆత్మహత్య చేసుకుందా ? లేక ఎవరైనా చెరువులోకి తోసేశారా? అనే వివరాలు తెలియాల్సి ఉంది. వృద్ధురాలి మృతిపై అనుమానాస్పద కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

28 ఎర్రచందన దుంగలు స్వాధీనం


దుంగలు, నిందితుడితో పోలీసులు

రాయచోటిటౌన్ : అన్నమయ్య జిల్లా వీరబల్లె మండలం వీరబల్లె ఫారెస్ట్ బీట్ పరిధిలో గత రాత్రి 28 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్లు ఏఆర్‌కు చెందిన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ కె. చక్రవర్తి ఆదేశాల మేరకు ఆర్‌ఎస్‌ఐ సురేష్‌బాబు బృందం మంగళవారం రాత్రి సానిపాయి బేస్ క్యాంపు నుంచి గడికోట చేరుకున్నారు. వీరబల్లె బీట్‌లో కూంబింగ్ నిర్వహించారు. ఝరికోన ప్రాంతంలో కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. వారిని హెచ్చరించి చుట్టుముట్టేలోపే దుంగలు పడేసి పారిపోయారు. ఒక నిందితుడు చిక్కాడు. అతడిని విచారించగా మొత్తం 14 మంది వచ్చినట్లు చెప్పాడు. అరెస్టయిన నిందితుడు తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరు జిల్లాకు చెందిన శంకర్ వెంకటేశన్ (36)గా గుర్తించారు. నిందితుడు తిరుపత్తూరు నుంచి చిత్తూరు మీదుగా రాయచోటికి చేరుకున్నాడు. అక్కడి నుంచి 15 రోజుల క్రితం అడవిలోకి వెళ్లాడు. నిందితుడిపై తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు. మిగిలిన వారిని కూడా త్వరలో పట్టుకుంటామన్నారు.

బాలికను మోసగించిన నిందితుడిపై పోక్సో కేసు

నిమ్మనపల్లె : పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ఓ మైనర్ బాలికను గర్భవతిని చేసిన నిందితునిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. మండలంలోని వెంగంవారిపల్లె పంచాయతీకి చెందిన ఓ మైనర్ బాలిక (17) ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఇంటి పట్టునే ఉంటోంది. ఇదే పంచాయతీ సాగిబండవారిపల్లెకు చెందిన చంద్రయ్య కుమారుడు గోవిందప్పగారి నారాయణ (32) మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ఆమెతో సన్నిహితంగా మెలిగి గర్భవతిని చేశాడు. ఈ విషయమై బయట చెబితే చంపేస్తానంటూ బెదిరించారు. ఈ క్రమంలో బాధితురాలు జరిగిన విషయం తల్లిదండ్రులకు తెలిపింది. బుధవారం తల్లి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తహసీల్దార్ సీఆర్.మంజుల, ఎంపీడీవో లీలామాధురి, ఐసీడీఎస్ సీడీపీవో సుజాత స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ భాను ప్రకాష్, బాధితురాలి మైనర్ బాలిక ఇంటికి వెళ్లి మాట్లాడారు. వివరాలు సేకరించారు. బాలికను స్థానిక పోలీసులకు అప్పగించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నిందితునిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

రాయచోటి : ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంకోసం కృషి చేయాలని అన్నమయ్య జిల్లా ఏపీజేఏసీ చైర్మన్ పి నరసింహ కుమార్ తెలిపారు. ఏపీజేఏసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన మలిదశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా బుధవారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ నరసింహ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించి ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారం కోరుతూ ఫిబ్రవరి 13న ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతి చేశామన్నారు. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వలేదన్నారు.. కార్యక్రమంలో రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు జనార్దన్ రాజు, అరవింద కిషోర్, రామాంజులు, జయసింహ, జనార్దన్ రెడ్డి, సురేష్ బాబు, హేమంత్, పాములేటి, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు నరసయ్య, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు నాగభూషణం రెడ్డి, జిల్లాలోని పలు డిపోలకు చెందిన రీజనల్ కమిటీ సభ్యులు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజీ కార్యదర్శులు, గ్రామ వార్డు సచివాలయ, మున్సిపల్, ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న మనోహర్ రాజు

రామాపురం : ప్రజల సమస్యలను పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయ జిల్లా అధికారి మనోహర్‌రాజు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాయం సిబ్బంది బయోమెట్రిక్ హాజరు వేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.ప్రజలకు తాగునీటి వసతి కల్పించాలన్నారు. గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కాకపోతే మండల స్థాయి అధికారుల దృష్టి తీసుకెళ్లాలని సిబ్బందికి సూచించారు. సెలవుపై వెళ్లేటప్పుడు పంచాయితీ సెక్రటరీకి తెలియజేయాలన్నారు. పంచాయితీ సెక్రటరీ సెలవులో వెళ్లాలంటే డిజిటల్ అసిస్టెంట్ కార్యదర్శికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఎంపీడీఓ హైదర్‌వల్లి, ఈఓపీఆర్‌డీ ఉషారాణి, ఏఓ శివశంకర్ పాల్గొన్నారు.

దుప్పి మాంసం స్వాధీనం


దుప్పి మాంసం, నిందితులతో అటవీ అధికారులు

చిట్వేలి : చిట్వేలి రేంజ్‌లోని కొండూరు బీటు పరిధిలోని పెనగలూరులో అడవి దుప్పి మాంసాన్ని స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. వివారలు..పెనగలూరులో బుధవారం మధ్యాహ్నం దుప్పిని చంపి మాంసం తీసుకొస్తుండగా విశ్వసనీయ సమాచారంతో సంబంధిత కొండూరు సెక్షన్ ఆఫీసర్ సావిత్రి వారి సిబ్బంది దాడిచేశారు. మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని చిట్వేలి రేంజ్ కార్యాలయంలో అప్పగించారు.

ఇన్‌చార్జి నచ్చకపోతే బాబుకు చెప్పి దించేయండి

దొమ్మలపాటిరమేష్



సమావేశంలో సీనియర్ నాయకులను హెచ్చరిస్తున్న దొమ్మలపాటిరమేష్

మదనపల్లె : 'ఎవరికి వారు ఇష్టారాజ్యంగా ప్రెస్‌మీట్లు పెట్టాల్సిన అవసరం లేదు..పెట్టకూడదు కూడా.. ఒక వెదవ పోయేది. పార్లమెంటు ఆఫీసులో చేసేది. తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ఆఫీసులో జరిగేది ప్రోగ్రాం కాదు? నీకు నచ్చకపోతే నోర్మూసుకుని వచ్చి చేయి. లేదా నీకు ఇన్‌చార్జి నచ్చకపోతే చంద్రబాబుకు చెప్పి ఇన్‌చార్జిని దించేయి. లేదంటే మీరే తెచ్చుకోండి ఇన్‌చార్జ్'... అంటూ మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి., మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ రెచ్చిపోయారు. పార్టీలోకి కొత్తగా చేరిన మైనారిటీ నాయకుడి దూకుడు, పొత్తులో మదనపల్లె టికెట్ తమకే అంటూ ప్రచారం చేసుకుంటున్న జనసేన నాయకుల తీరు, ఎవరికి వారే యమునాతీరే అంటూ ఇష్టారాజ్యంగా సీనియర్ నాయకులు పెట్టుకుంటున్న ప్రెస్‌మీట్లతో మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ ఫ్రస్టేషన్‌లోకి వెళ్లిపోయారు. బుధవారం నీరుగట్టువారిపల్లె టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో సొంతపార్టీ నాయకులపైనే ఆగ్రహావేశాలు ప్రదర్శిస్తూ, తనకు గిట్టనివారిని, ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని ఆశించి పార్టీలో ఉంటున్న వారిని ఏకిపారేశారు. 2019 ఎన్నికల ముందు టీడీపీలో ఉన్న వర్గపోరు నాలుగేళ్లుగా స్తబ్దుగా ఉందనుకుంటే ఎన్నికలు దగ్గరపడేసరికి తిరిగి మరో రూపంలో ప్రారంభం కావడంతో దిక్కుతోచని స్థితిలో అసహనానికి లోనై టీడీపీ కార్యకర్తలను ఐక్యంగా ఉంచకపోతే తోలుతీస్తా..అంటూ బెదిరింపులకు దిగారు. ఇదిలాఉంటే.. 35 ఏళ్లుగా టీడీపీలో టికెట్ కోసం తనతో పోరాడి పార్టీ విడిచిన ఓ నాయకుడు(గంగారపు రామదాస్‌చౌదరి) పొత్తులో భాగంగా తనకే సీటు వస్తుందని ప్రచారం చేసుకుంటున్నాడని, జనసేనతో పొత్తు ఉంటుందో లేదో స్పష్టంగా తెలియని పరిస్థితి ఉందన్నారు. అదేదో కోటాలో, ఇదేదో కోటాలో టికెట్‌లు వచ్చే స్థాయని ప్రచారాలు మానుకుని పార్టీ పటిష్టతకు అందరూ కష్టపడాలని, ఇన్‌చార్జ్ వెంట తప్పక నడవాల్సిందేనన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

ఒంటిమిట్ట(సిద్ధవటం): మండలంలోని కడప–రాజంపేట ప్రధాన రహదారిలో మారయ్యగారిపల్లె గ్రామ సమీపంలో బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి(60)ని కారు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందారు.సాస్థానికులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రోడ్డుపై నడుచుకుంటూ వెలుతున్న గుర్తుతెలియని వ్యక్తిని కడప వైపు నుంచి రాజంపేట వైపుకు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. తీవ్రగాయాలతో అక్కడిక్కడే మృతి చెందారన్నారు. హోటల్ యజమాని నారాయణ కారును ఆపే ప్రయత్నం చేయగా ఆపకుండా వేగంగా వెళ్లిపోయిందన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. వాహనం ఆచూకీ కోసం సంఘటన స్థలం సమీపంలోని డాబా ల దగ్గర ఉన్న వారిని పోలీసులు విచారించారు.కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుసూదన్ రావు తెలిపారు.

ఇద్దరు ఎక్సైజ్ కానిస్టేబుళ్లపై కేసు నమోదు

మదనపల్లె : అక్రమ మద్యం వ్యాపారులకు సహకరిస్తూ, అక్రమ రవాణాకు అండదండలు అందిస్తున్న ఇద్దరు ఎక్సైజ్ కానిస్టేబుళ్ల (ఎస్‌ఈబీ)ను గుర్తించి ఎస్‌ఈబీ ఉన్నతాధికారులు వారిపై కేసు నమోదు చేశారు. కేసు నమోదు కావడంతో నిందితులైన ఇద్దరు కానిస్టేబుళ్లు సెలవుపై వెళ్లిన సంఘటన ఆలస్యంగా తెలిసింది. గతనెల 15న మదనపల్లె ఎస్‌ఈబీ సీఐ శ్రీహరిరెడ్డి రహస్య సమాచారంతో పట్టణంలోని బెంగళూరు రోడ్డు తహసీల్దార్ కార్యాలయం వద్ద వాహనాలు తనిఖీ చేసి కర్ణాటక నుంచి కారులో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నారు. మదనపల్లెకు చెందిన ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి రాబట్టిన సమాచారంతో మరో ముగ్గురిని అరెస్ట్ చేశారు.అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాలతో పట్టుబడిన నిందితులను కస్టడీకి తీసుకుని సీఐ విచారణ చేశారు. దర్యాప్తులో మదనపల్లె మండలంలోని చీకిలబైలు సరిహద్దు చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఈబీ కానిస్టేబుళ్లు వెంకటేష్, శేఖర్‌లు మద్యం అక్రమ రవాణా వ్యాపారులకు సహకరిస్తున్నట్లు తేలింది. దీంతో వారిపై కేసు నమోదు చేశారు. ఈ విషయమై ఎస్‌ఈబీ ఏఈఎస్ రాధాకృష్ణను వివరణ కోరగా కర్ణాటక మద్యం అక్రమ రవాణాకు, వ్యాపారులకు సహకరిస్తున్నారనికానిస్టేబుళ్లపై కేసు నమోదు చేయడం వాస్తవమేనని, దర్యాప్తు అనంతరం వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అమ్మా.. వెళ్లిపోతున్నా..

అప్పుల బాధతో ఉత్తరం రాసి చేనేత కార్మికుడి ఆత్మహత్య


వెంకటేశ్వర్లు (ఫైల్)

మదనపల్లె : అమ్మా జాగ్రత్త.. రవి జాగ్రత్త వెళ్లిపోతున్నా అప్పుల బాధ భరించలేకున్నా మోటారు సైకిళ్లు కూడా రూ.25వేలకు తాకట్టు పెట్టేశాను. అప్పులతో జీవితాన్ని నెట్టుకురాలేను. అందుకే వెళ్లిపోతున్నా అంటూ ఓ చేనేత కార్మికుడు కుటుంబ సభ్యులకు ఉత్తరం రాసి, ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. కలకడ మండలం నడిమిచెర్ల పంచాయతీ వడ్డిపల్లెకు చెందిన వెంకటరమణ, రెడ్డెమ్మ దంపతుల కుమారుడు వెంకటేశ్వర్లు (31) పదేళ్ల క్రితం ఉపాధి కోసం మదనపల్లెకు వచ్చి నీరుగట్టువారిపల్లెలో స్థిరపడ్డాడు. చేనేత యజమాని వద్ద కార్మికుడిగా పని చేస్తూ ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివసిస్తున్నాడు. రెండు రోజులుగా వెంకటేశ్వర్లు పనికి రాకపోవడంతో, అద్దెకు ఉంటున్న ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు గమనించి యజమానికి సమాచారం అందించారు. దీంతో ఆయన పోలీసులకు తెలియజేశారు. టూటౌన్ సీఐ మురళీకృష్ణ ఆదేశాలతో టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించారు. గది తలుపులు పగులగొట్టి మృతదేహాన్ని కిందికి దించారు. అనంతరం శవపరీక్షల నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వద్ద ఉన్న ఉత్తరాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడి తల్లి రెడ్డెమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పదమృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు. రెడ్డెమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు రవీంద్ర ఆర్మీలో పని చేస్తుండగా, వెంకటేశ్వర్లు చేనేత కార్మికుడిగా పని చేస్తూ ఆత్మహత్యకు పాల్పడటంతో ఆమె రోధన చూపరులను విషాదాన్ని నింపింది.

సమన్వయంతో పనిచేయండి

- అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించేందుకు కృషి చేయాలి
- పార్టీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గాల పరిశీలకుల సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి, తిరుపతి : వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలని రాష్ట్ర మంత్రి, రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి పీఎల్‌ఆర్ గ్రాండ్‌లో బుధవారం చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం, పుట్టపర్తి జిల్లాల పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ పరిశీలకులతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమావేశం నిర్వహించారు. ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీల్లో 98.44 శాతం అమలుచేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. 27 నియోజకవర్గాల్లో గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై సమీక్షించారు. రోజుకు రెండు నియోజకవర్గాల్లో పర్యటించనున్నట్లు పార్టీ నాయకులకు తెలిపారు. అందరినీ సమన్వయపరచి అత్యధిక స్థానాల్లో పార్టీ విజయం సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.

భార్యపై దాడి

మదనపల్లె : మద్యం మత్తులో భార్యపై భర్త దాడి చేసిన సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. బీఎస్.రెడ్డికాలనీకి చెందిన జైనూబీ (40)పై ఆమె భర్త ఖాదర్‌బాషా మద్యం మత్తులో దాడిచేసి విచక్షణారహితంగా కొట్టాడు. దాడిలో ఆమె తీవ్రంగా గాయపడింది.